ఆర్టీసీ బస్సులకు ఆటోల దెబ్బ!



ఖాళీగా తిరుగుతున్న ఆర్టీసీ బస్సు

- ఆటోల్లో ప్రయాణికుల తరలింపు
- ఖాళీగా తిరుగుతున్న బస్సులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



గురునాథ్ సర్కిల్‌లో ప్రయాణికుల కోసం ఆటో

హిందూపురం అర్బన్: హిందూపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఆటోల బెడదతో.. బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు హిందూపురం–కొడికొండ చెక్‌పోస్టు, లేపాక్షి మధ్య నిత్యం 20 వరకు ఆటోలు ప్రయాణికులను చేరవేస్తుండగా.. ఆర్టీసీ బస్సులు మాత్రం ఖాళీగా తిరుగుతున్నాయి. గతంలో హిందూపురం–బాగేపల్లి ఫోర్ సింగల్ బస్ సర్వీసులు అత్యధిక కలెక్షన్స్ తెచ్చేవి. అయితే టోల్ పడటంతో ఆ సాకు చూపి ఆర్టీసీ అధికారులు బాగేపల్లి–హిందూపురం సర్వీసులు తొలగించారు. తరువాత ప్రైవేట్ బస్సులు రాజ్యమేలాయి. ఇప్పుడు మాత్రం ప్రతి ఐదు నిమిషాలకు ఓ ఆటో హిందూపురం– కొడికొండ చెక్‌పోస్టు మధ్య తిరుగుతోంది. ప్రధానంగా చెక్‌పోస్టులో ఎక్కించుకుని దేమకేతేపల్లి వయా లేపాక్షిలో దింపడం.. అక్కడ మళ్లీ ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. కొడికొండ చెక్ పోస్టు–హిందూపురం మధ్య 26 కిలోమీటర్లు ఉన్నా ఆటోలు తిప్పుతున్నారు.

నష్టపోతున్న ఆర్టీసీ..

హిందూపురం– కొడికొండ చెక్‌పోస్టు మధ్య ఆరు బస్సు సర్వీసులు నిత్యం తిరిగేవి. ఒక్కో బస్ నాలుగు నుంచి ఆరు ట్రిప్పులు నడిచేవి. అదే రీతిలో కలెక్షన్స్ వచ్చేవి. ఇప్పుడు కలెక్షన్స్ పూర్తిగా పడి పోయాయి. ప్రస్తుతం ఖాళీ బస్సులు తిరుగుతుండడంతో కలెక్షన్లు ఏమాత్రం లేవని కండెక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

పక్కా ప్రణాళికతో..

కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఏదైనా ఆర్టీసీ బస్సు బయలు దేరుతుందంటే చిలమత్తూరుకు ఆటోవాలాలు సమాచారం ఇవ్వడం.. వెంటనే చిలమత్తూరు వద్ద వేచి ఉన్న ప్రయాణికులను లోడ్ చేసుకుని బయలుదేరుతాయి. అలాగే హిందూపురంలో గురునాథ్ సర్కిల్ వద్ద కొడికొండ చెక్‌పోస్టు, లేపాక్షి వెళ్లేందుకు సిద్ధంగా ఉండి పరిగి బస్టాండ్‌లో బస్సు బయలు దేరుతోందన్న సమాచారం రాగానే అక్కడ ఉన్న ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లడం జరుగుతోంది. దీంతో బస్సులు ఖాళీగా నడపాల్సివస్తోందని ఆర్టీసీ డ్రైవర్లు వాపోతున్నారు.

ఆటోలపై చర్యలు తీసుకుంటాం

ఆటోల్లో ప్రయాణికులను ఎక్కువ దూరం తిప్పరాదు. కెపాసిటీకి మించి తరలించరాదు. ప్రమాదాలు జరిగితే బాధ్యత ఉండదు. కొడికొండ చెక్‌పోస్టు–హిందూపురం మధ్య ప్రయాణికులను తరలించే ఆటోలపై చర్యలు తీసుకుంటాం.

– కరుణసాగర్‌రెడ్డి , జిల్లా రవాణాశాఖ అధికారి, హిందూపురం

క్లుప్తంగా

వైఎస్సార్ మెమోరియల్ టోర్నీ విజేత టీమ్ స్పిరిట్ జట్టు



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని మోతుకపల్లి వద్ద నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా 'టీమ్ స్పిరిట్' జట్టు నిలిచింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి హాజరై విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులకు ప్రదానం చేశారు. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ. 20 వేలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీఉల్లా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి గిరి, నాయకులు శబరీష్‌రెడ్డి, ఎస్ఎం ఫారుఖ్, అయూబ్ బేగ్, శ్రీనాథ్, బాబాజాన్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి జాతర



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: నీలమ్మనహళ్లిలో వెలసిన కాలజ్ఞాని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతర వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పురోహితులు మాత గోవిందమాంబ, జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అంతకు ముందు ఆలయంలో కలశ స్థాపన, నవగ్రహ, గణపతి, మృత్యుంజయ, నవనాగ, వీరబ్రహ్మేంద్ర స్వామి, ఆయుష్య హోమాలు, మహా పూర్ణాహుతి నీరాజనం పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు పాల్గొని వీర బ్రహ్మేంద్రస్వామి కి ఘనంగా పూజలు సమర్పించారు.

తెలుగు భాషకు ప్రత్యేక స్థానం




కవులను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి: ప్రపంచ గర్వించదగ్గ భాషల్లో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం ఉంది. అందుకే దేశ భాషలందు తెలుగు లెస్స అన్నారని వక్తలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అమర్ విద్యా మందిరంలో అష్టావధానం నిర్వహించారు. భాషా పండితులు, కవులు, రచయితలు చేసిన వ్యాకరణోపాఖ్యానం, భాషా సంస్కృతి సాంప్రదాయాలపై చేపట్టిన పద విన్యాసం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యవస్థాపన అధ్యక్షుడు అమానుల్లా, కరస్పాండెంట్ సయ్యద్ ఇబ్రహీం, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ పాల్గొన్నారు.

నేడు కోనాపురంలో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలోని కోనాపురం గ్రామంలో సోమవారం 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మాజీ మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధర్నా విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ: పట్టణంలోని సచివాలయాల వద్ద ఈనెల 24న, మార్చి 3న తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాకు రైతులు, నాయకులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ రైతు రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. పంటలకు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని చెరువులకు నీరు, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



కొడిగొనహళ్లిలో చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ శ్రీధర్



అమరాపురంలో చెత్త సేకరణ ప్రారంభిస్తున్న ఈఓఆర్డీ నాగముని

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్ చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ప్రజలు చైతన్యవంతులై పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధుల్లో చెత్తా చెదారం లేకుండా నిత్యం పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు చూసుకోవాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని బీచిగానిపల్లి, ఊటుకూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మడకశిరరూరల్: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి వరదరాజులు సూచించారు. ఆదివారం కల్లుమర్రి గ్రామంలో కార్మికులు ఇంటింటా చెత్తను సేకరించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా చెత్త తొట్టిలోకి వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభం

అమరాపురం: మండల కేంద్రంలో ఇంటింటా చెత్త సేకరణను ఈఓఆర్డీ నాగముని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. ప్రజలు చెత్తను రోడ్డుపైన పారేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్తవాహనంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం



మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బీ.నరసేగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నిడ్రగట్టలో జరిగిన ఓ వివాహానికి హాజరైన వారు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పావగడ తాలుకా స్వారమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావొస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను నేరవేర్చలేదని మండిపడ్డారు. కూటమి నేతలను నమ్మి ఓట్లేసిన ప్రజలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అర్హులైన అనేక మంది అవ్వ తాతలు, వితంతువులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వారిని తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రబీ పంటలు కళకళ



తమ్మడేపల్లిలో కళకళలాడుతున్న రాగి

అమరాపురం: మండలవ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు బోరు బావుల కింద సాగు చేసిన పంటలు కళ కళలాడుతున్నాయి. వాణిజ్య పంటలైన పొగాకు, మెడిసిన్ సౌతే, ఉల్లితో పాటు రాగి, వరి తదితర పంటలు 970 ఎకరాల్లో సాగు చేశారు. తమ్మడేపల్లి, అమరాపురం, హేమావతి, కెంకెర, మద్దనకుంట, హలుకూరు, చిట్నడకు, కాచికుంట, కొర్రేవు, నిడ్రగట్ట తదితర గ్రామాల్లో ఎక్కువగా పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అమరాపురంలో సాగైన ఉల్లి



కళకళలాడుతున్న మెడిసిన్ సౌతే పంట

ఘనంగా పార్శ్వనాథ తీర్థంకరుల వార్షిక పూజ



పార్శ్వనాథ మూల విగ్రహం వద్ద కలశస్థాపన చేసిన దృశ్యం

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన పార్శ్వనాథ తీర్థంకరుల బసది ఆలయంలో ఆదివారం జైన మతస్తులు స్వామి వార్షిక పూజను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి మూల విగ్రహాన్ని అలంకరించి అభిషేకించారు. తర్వాత కలశస్థాపన, కలశ పూజ, నవగ్రహారాధన పూజలు చేశారు. వక్తలు మాట్లాడుతూ రత్నగిరి చారిత్రక అధ్యాత్మిక పర్యాటక కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. రాబోవు తరాల వారికి పురాతన చారిత్రక విషయాలు తెలియజేయాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం చేశారు.

మైలార లింగేశ్వరస్వామికి దోనె సేవ



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: తమ్మడేపల్లిలో వెలసిన దళితుల ఆరాధ్య దైవం మైలారలింగేశ్వరస్వామికి దోనె సేవను భక్తులు ఘనంగా ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు మల్లేష్, హరీష్‌స్వామి స్వామి వారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు నూతనంగా చేయించిన గాలిగోపుర కలశాన్ని ఆలయ గోపురంపై ప్రతిష్ఠించారు. అనంతరం దోనెలను ఏర్పాటు చేసి పాలు, పెరుగు, చక్కెర, నెయ్యి, పండ్లు తదితర వాటిని దోనెలో వేసి గొరవయ్యలు ఏళు కోటి, ఏళు కోటి, మైలార లింగేశ్వర అంటూ పాట పాడుతూ నృత్యం చేశారు. ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

వైభవంగా కెంపేగౌడ జయంత్యుత్సవాలు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

గుడిబండ: శంకరగల్లు గ్రామంలో వక్కలిగ ఆరాధ్య దైవం కెంపేగౌడ జయంత్యుత్సవాలను వక్కలిగ కులస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచే కాకుండా కర్ణాటకలోని తుమకూరు, హిరియూరు, శిరా, పావగడ తదితర నియోజకవర్గాల నుంచి అనేక మంది వక్కలిగ కులస్తులు తరలివచ్చారు. తొలుత కెంపేగౌడ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కలశాలను తలమీద మోసుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిని రథంలో కెంపేగౌడ చిత్ర పటాన్ని ఉంచి గ్రామ పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మాట్లాడుతూ కెంపేగౌడ బెంగళూరు నగరాన్ని నిర్మించి దక్షిణ భారతదేశంలోనే నిరుద్యోగులకు ఎంతగానో మేలు చేశారన్నారు. కార్యక్రమానికి మడకశిర మాజీ ఎంపీపీ అశ్వత్‌రామప్ప, వైఎస్సార్‌సీపీ గుడిబండ, రొళ్ల మండల కన్వీనర్లు డీఎల్ యంజారేగౌడు, నరసింహారెడ్డి, వక్కలిగ కార్పొరేషన్ మాజీడైరెక్టర్ నాగన్న, స్థానిక సర్పంచ్ జయమ్మ, రొళ్ల మండలం వన్నార్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు రంగనాథ్, నాయకుడు నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

బత్తలపల్లి: అప్పరాచెరువు చెరువు కట్ట వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం.. ధర్మవరం మండలం వెంకటతిమ్మాపురానికి చెందిన గుజ్జల శ్రీనివాసులు తన భార్య భాగ్యలక్ష్మితో కలిసి నార్పల సమీపంలో జరిగిన శుభాకార్యానికి హాజరై స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అప్పరాచెరువు చెరువు కట్ట వద్ద వెనుక నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఘటనలో దంపతులిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమి చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ రమేష్ తెలిపారు.

వీరముద్దప్పస్వామి ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన దృశ్యం

ధర్మవరం రూరల్: చిగిచెర్ల వద్ద ముష్టూరుకు వెళ్లే రహదారిలో వెలసిన వీరముద్దప్పస్వామి, గంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పూజారి పుల్లన్న తెలిపిన వివరాలు.. పూజారి రోజూ లాగే శనివారం సాయంత్రం ఆలయంలో పూజలు నిర్వహించి తాళం వేసి ఇంటికెళ్లాడు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా గేటు తెరిచి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా స్వామికి చెందిన 10 తులాల వెండి ఆభరణాలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

శుభకార్యం

పరిగి: శీగిపల్లి పంచాయతీ పరిధిలోని గణపతిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం నూతన గృహప్రవేశానికి మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ హాజరయ్యారు. అలాగే కొడిగెనహళ్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఉమేష్ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీరంగరాజుపల్లికి చెందిన కురుబ తిమ్మప్ప కుమారుడు సంతోష్ వివాహంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సవితా ప్రభాకర్, సర్పంచ్ లక్ష్మణ్ణ, మండల కన్వీనర్ నరసింహ మూర్తి, ఎంపీటీసీ మారుతీరెడ్డి, మైనార్టీ నాయకుడు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప వేదిక జిల్లా అధ్యక్షుడిగా సురేష్

రొళ్ల: రత్నగిరి గ్రామానికి చెందిన సురేష్ ప్రజాసంకల్ప వేదిక అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రకాశం జిల్లా గిద్దలూరులో జరిగిన సమావేశంలో ఏపీ హైకోర్టు అడ్వొకేట్ రంగసాయిరెడ్డి సురేష్‌కు నియామక పత్రం అందజేశారు. పేదల అభ్యున్నతి కోసం శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని సురేష్ ఈసందర్భంగా పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు



గాయాల పాలైన జేడీఎస్ నేత శివప్ప

పావగడ: తాలూకా సరిహద్దులోని బేడ్తూరు గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయ. వివరాలు.. పావగడకు చెందిన జేడీఎస్ సీనియర్ నాయకుడు శివప్ప తన భార్య జయమ్మ, ఆమె సోదరితో కలిసి ఓ వివాహానికి హాజరై కారులో తిరుగుపయమయ్యారు. బేడ్తూరు వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న నీటితొట్టెను ఢీకొంది. ఘటనలో తీవ్రగాయాలపాలైన జయమ్మ సోదరి అక్కడికక్కడే మృతి చెందింది. శివప్ప, జయమ్మకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించొద్దు



తోపుడు బండ్ల వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మడకశిర: రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించొద్దని సీఐ రాజ్‌కుమార్ వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని వాల్మీకి, అంబేడ్కర్ సర్కిళ్ల వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో సీఐ ఆదివారం సాయంకాలం చిరువ్యాపారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టుకుంటే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అనంతరం వడ్రపాళ్యం, శివాపురం, ఎస్సీ కాలనీ తదితర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



నల్లమాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని చోరీలు, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు చేశారు. హెల్మెట్ వాడకం, ఫేస్ వాష్‌పై అవగాహన కల్పించారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.